సాక్షి
రంగారెడ్డి
గురువారం । 24 । అక్టోబర్ । 2024



ఫార్మా భూముల్లో సిరులు

ఫార్మా భూముల్లో రైతులు సిరులు పండిస్తున్నారు. అక్కడి నేలలు సాగుకు అనుకూలం కావడంతో ఆసక్తి చూపిస్తున్నారు. 8లో▸



మౌలిక వసతులు కల్పించాలి

భవన నిర్మాణ రంగ కార్మికులకు తంబ్ విధానాన్ని రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రామస్వామి కోరారు. 8లో▸



స్థలాన్ని కాపాడండి

తమ సంఘానికి కేటాయించిన స్థలాన్ని కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. 8లో▸

న్యూస్‌రీల్

ముదిరాజులను బీసీ ఏలో చేర్చాలి



బీసీ కమిషన్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ముదిరాజులు

షాద్‌నగర్‌రూరల్: బీసీ డీలో ఉన్న ముదిరాజు కులస్తులను బీసీ ఏ లో చేర్చాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అందె బాబయ్య అన్నారు. ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ పిలుపు మేరకు బుధవారం ఖైరతాబాద్‌లోని బీసీ కమిషన్ కార్యాలయంలో ముదిరాజ్ సంఘం నాయకులు వినతిపత్రం సమర్పించారు. అనంతరం అందె బాబయ్య మాట్లాడుతూ.. తెలంగాణ ప్రాంతంలో ఎక్కువ జనాభా కలిగిన ముదిరాజులు అన్ని రంగాల్లో వెనుకబడి పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీ డీ గ్రూపులో ఉన్నందున ప్రభుత్వ ఫలాలు అందరికీ అందడం లేదన్నారు. ముదిరాజుల సమస్యలను బీసీ కమిషన్ ద్వారా పరిష్కరించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. బీసీ కమిషన్ సర్వేకు వచ్చినప్పుడు ప్రతిఒక్కరూ ముదిరాజులమని చెప్పుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు మహేశ్, శివయ్య, ప్రధాన కార్యదర్శి సంతోష్, కుమార్, వెంకట్, భద్రన్న, పద్మ, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ప్రదీప్‌కుమార్



నియామకపత్రం అందుకుంటున్న మానపాటి ప్రదీప్‌కుమార్

షాద్‌నగర్: బీసీ మహాసభ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా పట్టణానికి చెందిన మానపాటి ప్రదీప్ కుమార్ నియమితుయ్యారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని పరిగిరోడ్డులోగల సంఘం కార్యాలయంలో బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మెట్టుకాడి శ్రీనివాస్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పదవి అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. బీసీల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో బీసీ మహాసభ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణాజీ, నియోజకవర్గ యువత విభాగం అధ్యక్షుడు శ్రీధర్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.


ఉచితంగా మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ శిక్షణ

మొయినాబాద్: జిల్లాలోని నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ మహిళలకు మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ శిక్షణ ఇవ్వనున్నట్లు దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం డీఎం శైలకుమారి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిధిలోని చిలుకూరులో ఉన్న దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం (మహిళా ప్రాంగణం)లో గ్రామీణ ప్రాంతంలోని ఎస్సీ, ఎస్టీ మహిళలకు రెండు సంవత్సరాలపాటు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. పదో తరగతి, ఇంటర్ చదివి ఆసక్తి ఉన్నవారు ఈ నెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. సర్టిఫికెట్స్‌తోపాటు కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో https//chfw.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కాలుష్య నిర్మూలనకు కృషి

పరిగి: మానవుడి వికృత చేష్టలతో పర్యావరణం మలినమైపోతోందని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్, బయోడీజిల్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలో ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్, బయోడీజిల్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు కాలుష్య నిర్మూలనకు కృషి చేయాలన్నారు. టెక్నాలజీ పెరుగుతున్న కొద్దీ జీవావరణం, జవసత్వాలు, జీవజాతులు అంతు చిక్కని రోగాలతో జీవశ్చవంలా మారుతున్నాయన్నారు. పర్యావరణ కాలుష్య నివారణకు ప్రతీ ఒక్కరు బాధ్యతాయుతంగా ఉండాలన్నారు. సీఎన్‌జీ ప్లాంట్ ఏర్పాటుకు ఈ సంస్థ ప్రోత్సహిస్తోందన్నారు. ఈ సంస్థ ద్వారా పరిగిలో ఏర్పాటు చేయనున్న బయో ప్లాంట్ ద్వారా 200 మందికి ఉపాధి అవకాశాలు దక్కుతాయన్నారు. ఈ కార్యక్రమంలో రాజీవ్‌రెడ్డి, కృష్ణకాంత్, రాజశేఖర్, చారి పాల్గొన్నారు.

ధరఖాస్తు!



‘రెవెన్యూ’లో అక్రమార్కులు

- ‘ధరణి’ పరిష్కారంలో చేతివాటం
- భూ విస్తీర్ణం, వాటి ధరలను బట్టి కమీషన్ల వసూలు
- అధికారుల తీరుపై ఫిర్యాదుల వెల్లువ

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ధరణి దరఖాస్తులు కొంత మంది రెవెన్యూ అధికారులకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. పాసుబుక్‌లో యజమాని పేర్ల నమోదులో దొర్లిన తప్పుల సవరణ, విస్తీర్ణంలో హెచ్చు తగ్గులు, నిషేధిత జాబితా నుంచి పట్టా భూముల తొలగింపు వంటి పనులకు క్షేత్రస్థాయిలోని కొంత మంది రెవెన్యూ అధికారులు అడ్డగోలు వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. భూ విస్తీర్ణం, వాటి ధరలను బట్టి కమీషన్లు వసూలు చేస్తున్నారు. వారు అడిగినంత ఇస్తే సరి.. లేదంటే ఆయా దరఖాస్తులను పరిశీలించకుండానే తిరస్కరిస్తున్నారు. కనీస కారణం కూడా చూపడం లేదు. అదేమంటే తమకేం సంబంధం లేదు.. కలెక్టర్‌ను అడగండి అంటూ చెప్పి తప్పించుకుంటున్నారు. విధిలేని పరిస్థితు ల్లో కొంత మంది ఏసీబీని ఆశ్రయిస్తుండగా, మరికొంత మంది ఉన్నతాధికారులు, మీడియా ప్రతినిధులను ఆశ్రయిస్తున్నారు. అక్రమార్కులను అక్కడి నుంచి తప్పించాలని వేడుకుంటున్నారు.

ఇస్తే ఓకే..లేదంటే తిరస్కరణే..

ధరణి పోర్టల్‌లో దరఖాస్తులు భారీగా పేరుకుపోయాయి. మూడు నెలల క్రితం వరకు 40 వేలు పెండింగ్‌లో ఉండగా, సీసీఎల్‌ఏ ఆదేశాల మేరకు పలు సందర్భాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఫైళ్లను క్లియర్ చేశారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 25 వేలకుగా పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. వీటిలో మెజార్టీ దరఖాస్తులు తహసీల్దార్ల వద్దే పెండింగ్‌లో ఉన్నాయి. ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదికలు సిద్ధం చేసి కలెక్టర్‌కు పంపాల్సిన వీఆర్‌ఏలు ముందే దరఖాస్తుదారులను సంప్రదిస్తున్నారు. వారు అడిగినంత ఇస్తే అనుకూలంగా నివేదిక ఇస్తున్నారు. లేదంటే వ్యతిరేక రిపోర్టులు అందజేస్తూ దరఖాస్తు తిరస్కరణకు కారణం అవుతున్నారు. విధిలేని పరిస్థితుల్లో రియల్టర్లు (మెజార్టీ భూ బాధితులు) వారు అడిగినంత ఇచ్చి సమస్యను పరిష్కరించుకుంటుండగా, ఆర్థిక స్థోమత లేని సాధారణ రైతులు నిరాకరిస్తున్నారు. దీంతో వీరి దరఖాస్తులు క్లియర్ కాకపోగా, రెండేళ్లుగా పెండింగ్‌లోనే ఉంటుండటం ఆందోళన కలిగిస్తోంది. మొయినాబాద్ తహసీల్దార్ సహా డీటీ, సీనియర్ అసిస్టెంట్లపైనే కాదు.. బూర్గుల పాత వీఆర్‌ఏపై కూడా ఫిర్యాదులు వెల్లువెత్తడాన్ని పరిశీలిస్తే రెవెన్యూ అధికారుల పరితీరుపై అనుమానాలు వ్యక్తం కాక మానవు.

డబ్బులిచ్చినా పని కాలేదు

ఫరూఖ్‌నగర్ మండలం బూర్గుల రెవెన్యూ సర్వే నంబర్ 575లో నాకు 2.17 ఎకరాల భూమి ఉంది. పాసుబుక్ జారీలో తప్పులు దొర్లాయి. వాటిని సరి చేయాల్సిందిగా రెవెన్యూ అధికారులకు విజ్ఞప్తి చేశా. మాజీ వీఆర్‌ఏ ఇందుకు డబ్బులు డిమాండ్ చేశాడు. దీంతో ఆయనకు రూ.6.42 లక్షలు చెల్లించాను. ఆరు నెలలైంది. ఇప్పటికీ పని పూర్తికాలేదు. డబ్బులు తీసుకుని తప్పించుకు తిరుగుతున్నాడు. దీనిపై ఫరూఖ్‌నగర్ తహసీల్దార్‌కు సైతం ఫిర్యాదు చేశాను. కనీసం నా డబ్బులైనా నాకు ఇప్పించండి.

– కావలి అంజయ్య, బూర్గుల

వారిని తప్పించండి

తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్ల అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. ధరణి దరఖాస్తుల పరిష్కారంలో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడుతున్నారు. వారు అడిగినంత ఇస్తే సరి లేదంటే ఫైల్ రిజెక్ట్ చేస్తున్నారు. తహసీల్దార్ వారానికి కనీసం మూడు రోజులు కూడా ఆఫీసుకు రాడు. వచ్చినా రెండు మూడు గంటలకు మించి ఉండటం లేదు. ఆయనతో పాటు ఇతర అధికారులు ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారు. అ క్రమ వసూళ్లకు పాల్పడుతున్న వారిని వెంటనే ఇక్కడి నుంచి బదిలీ చేయాలి.

– పి.కృష్ణయ్య యాదవ్, అజీజ్‌నగర్

భూమాతను కాపాడుకుంటేనే మానవాళికి మనుగడ



వ్యాయామ ఉపాధ్యాయులకు ప్రారంభమైన శిక్షణ

సీజీఆర్ చైర్ పర్సన్ లీలా లక్ష్మారెడ్డి

కడ్తాల్: భూమాతను కాపాడుకుంటేనే మానవాళికి మనుగడ ఉంటుందని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ చైర్ పర్సన్ లీలా లక్ష్మారెడ్డి అన్నారు. మండల పరిధిలోని అన్మాస్‌పల్లి సమీపంలోని ఎర్త్‌సెంటర్‌లో కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూషన్–తెలంగాణ పాఠశాల విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో వ్యాయామ ఉపాధ్యాయులకు రెండు రోజుల పాటు నిర్వహించనున్న ‘స్కూల్ ఎర్త్ క్లబ్ యంగ్ ఎర్త్ లీడర్స్’ ఓరియంటేషన్ బుధవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఖమ్మం, నిజామాబాద్, మహబూబాబాద్ జిల్లాల నుంచి 80 మంది ఫిజికల్ డైరెక్టర్లతో పాటు ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు హాజరయ్యారు. రిటైర్డు ఐఎఫ్‌ఎస్ అధికారి రఘువీర్, వందేమాతరం ఫౌండేషన్ అధ్యక్షుడు రవీందర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. లీలా లక్ష్మారెడ్డి స్వాగతోపన్యాసం చేస్తూ 14 ఏళ్లుగా సీజీఆర్ సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న పర్యావరణ కార్యక్రమాలను వివరించారు. విద్యార్థి దశ నుంచే పర్యావరణాన్ని కాపాడే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. పర్యావరణ రక్షణ కార్యక్రమాల్లో యువత, విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రధాన భూమిక పోషించాల్సిన అవశ్యకత ఉందన్నారు. రిటైర్డు ఐఎఫ్‌ఎస్ అధికారి రఘువీర్ మాట్లాడుతూ.. శక్తి వనరులు, విద్యుత్ శక్తి ఆదా చేసే చర్యల గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ ఎవరి ఇంట్లో వారు విద్యుత్ ఆదా చేసే విధంగా నెలవారీ విద్యుత్ యూనిట్లను తగ్గించుకునేందుకు కృషి చేయాలని సూచించారు. ఎంత వినియోగం తగ్గిస్తే అంత ఆదా చేసిన వాళ్లం అవుతామని తెలిపారు. వందేమాతరం ఫౌండేషన్ అధ్యక్షుడు రవీందర్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు సీజీఆర్ సంస్థ చేపట్టిన కార్యక్రమం ఒక విశ్వ యజ్ఞమని అభినందించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. సీజీఆర్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. పర్యావరణ పరిరరక్షణలో భాగంగా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించాలని, ఉపాధ్యాయులకే అది సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రెడ్డి, సీజీఆర్ స్టేట్ కో ఆర్డినేటర్ యానాల వెంకట్‌రెడ్డి, సీజీఆర్ అసిస్టెంట్ డైరెక్టర్ జేఎస్ఆర్ అన్నమయ్య, సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆ బస్తీలో మరో యువకుడికి డెంగీ

పహాడీషరీఫ్: నెల రోజుల క్రితం జల్‌పల్లి మున్సిపాలిటీలోని వాదే ముస్తఫా బస్తీలో డెంగీ కారణంగా ఇద్దరు చిన్నారులు మృతి చెందిన ఘటన మరువక ముందే అదే బస్తీలో మరో యువకుడు వ్యాధి బారిన పడ్డాడు. షేక్ నజీర్ అహ్మద్ అనే యువకుడు కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతుండడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షలు నిర్వహించగా డెంగీ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సమాచారం అందుకున్న వెంటనే బాలాపూర్ యూపీహెచ్‌సీ వైద్యులు, జల్‌పల్లి మున్సిపాలిటీ అధికారులు బుధవారం బస్తీలో పర్యటించారు. ఇరుగు పొరుగు వారి రక్త నమూనాలను సేకరించడంతో పాటు జ్వర పరీక్షలు నిర్వహించారు. మున్సిపాలిటీ సిబ్బంది పరిసరాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడంతో పాటు దోమల నివారణ మందు పిచికారీ చేశారు.



దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న అధికారులు

ఇబ్రహీంపట్నం: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఎంజేపీటీబీసీడబ్లూ ఆర్‌ఈఐఎస్ జాయింట్ సెక్రటరీ మద్దిలేటి అన్నారు. మహాత్మ జ్యోతి బాయి పూలే వెనుకబడిన తరగతుల గురుకుల బాలికల విద్యాలయాల (ఖైరతాబాద్, చాంద్రాయణగుట్ట అండర్–14, అండర్–19) విద్యార్థులకు చర్లపటేల్‌గూడ పరిధిలోని రాజమహేంద్ర ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం స్పోర్ట్స్ మీట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానసిక ఎదుగుదలకు, శారీరక దారుఢ్యానికి క్రీడలు దోహదపడతాయని అన్నారు. క్రీడల్లో మంచి ప్రావీణ్యాన్ని సాధించేందుకు ఇలాంటి పోటీలు ఉపయోగపడతాయన్నారు. గెలుపోటములను సమానంగా తీసుకొని ముందుకెళ్లాలని సూచించారు. ఈ నెల 29 వరకు నిర్వహించే ఈ క్రీడల్లో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, టెన్నికాయిట్, లాంగ్‌జంప్, హై జంప్, రన్నింగ్, షార్ట్‌పుట్ తదితర పోటీలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో సంస్థ ఏజీఓ లక్ష్మయ్య, జిల్లా బీసీ వెల్ఫేర్ కార్యదర్శి ఆశన్న, హైదరాబాద్ రీజినల్ కోఆర్డినేటర్ ఆదిత్యవర్మ, జిల్లా కో ఆర్డినేటర్ వెంకట్‌రావు, ఆయా విద్యాలయాల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్

45 కేంద్రాలు.. 80 వేల మెట్రిక్ టన్నులు

వరి ధాన్యం సేకరణకు సర్వం సిద్ధం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లాలో ధాన్యం కొనుగోలుకు సర్వం సిద్ధమైంది. మొత్తం 45 కొనుగోలు కేంద్రాల ద్వారా 80 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గ్రేడ్–ఎ రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,320 చొప్పున, కామన్ ధాన్యానికి రూ.2,300 చొప్పున ధర నిర్ణయించింది. ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో సన్నరకం క్వింటాల్‌కు రూ.2,800 చొప్పన చెల్లించాలని నిర్ణయించింది. ఈ మేరకు బుధవారం అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ మార్కెటింగ్, సివిల్ సప్లయ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో సన్నరకం 50 వేల మెట్రిక్ టన్నులు, దొడ్డురకం 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ మేరకు పీపీసీ ఐకేపీ ద్వారా ఆరు కేంద్రాలు, పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో 30, డీసీఎంఎస్‌ల ఆధ్వర్యంలో తొమ్మిది కేంద్రాలు తెరవాలని నిర్ణయించినట్లు చెప్పారు. 2.5 ఎంఎం కంటే ఎక్కువ పొడవు, వెడల్పు నిష్పత్తినికి కొలిచేందుకు గ్రేయిన్‌కాలిపర్ పరికరాలను అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని మిల్లుకు పంపే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సన్న రకం ధాన్యం బస్తాలను రెడ్‌కలర్ దారంతో, దొడ్డు రకం ధాన్యాన్ని నింపిన బస్తాలను ఆకుపచ్చరంగు దారంతో కుట్టడం ద్వారా గుర్తింపు సులభమవుతుందని ప్రతిమా సింగ్ సూచించారు.

భాస్కర మెడికల్ కళాశాలకు సునీల్‌కుమార్ భౌతికకాయం



సునీల్‌కుమార్ (ఫైల్)

మొయినాబాద్: సామాజిక సేవకుడి భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులు భాస్కర మెడికల్ కళాశాలకు అప్పగించారు. నగరంలోని బోరబండ ప్రాంతానికి చెందిన డీఆర్ సునీల్‌కుమార్ పన్నెండేళ్ల క్రితం మొయినాబాద్ మండలంలోని రెడ్డిపల్లికి వచ్చి గ్రామంలో ఓ పెంకుటిల్లు తీసుకుని ఇక్కడే ఉంటున్నారు. సొంత డబ్బులతో గ్రామంలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి చదుకునే యువకులను ప్రోత్సహించేవారు. పరిసర గ్రామాల్లో సైతం వివిధ రకాల సామాజిక సేవా కార్యక్రమాలు చేట్టారు. ఆయన కుటుంబ సభ్యులు మాత్రం బోరబండలోనే ఉంటున్నారు. తాను మరణిస్తే తన భౌతికకాయాన్ని భాస్కర మెడికల్ కళాశాలకు దానం చేసే విధంగా పదేళ్ల క్రితమే అంగీకర పత్రం రాసిచ్చారు. బుధవారం సునీల్‌కుమార్ అనారోగ్యంతో రెడ్డిపల్లిలో మరణించారు. విషయాన్ని గ్రామస్తులు కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో వారు వచ్చి ఆయన నిర్ణయం ప్రకారం భౌతికకాయాన్ని భాస్కర మెడికల్ కళాశాలకు అందజేశారు.



సునీల్‌కుమార్ భౌతికకాయాన్ని మెడికల్ కళాశాలకు అప్పగిస్తున్న కుటుంబ సభ్యులు

డ్యూటీమీట్ విజేతలకు సీపీ సత్కారం



సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ పోలీసు అకాడమీలో జరిగిన రాష్ట్ర స్థాయి పోలీసు డ్యూటీమీట్‌లో పతకాలు సాధించిన 35 మంది నగర పోలీసు అధికారులు, సిబ్బందిని కొత్వాల్ సీపీ ఆనంద్ అభినందించారు. బంజారాహిల్స్‌లోని టీజీ సీసీసీలో ఉన్న కమిషనరేట్‌లో బుధవారం ఈ కార్యక్రమం జరిగింది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారి జరిగిన ఈ డ్యూటీ మీట్‌లో నగర పోలీసులు మంచి ప్రతిభ చూపడంపై ఆనంద్ హర్షం వ్యక్తం చేశారు. వారికి నగదు ప్రోత్సాహకం అందించి సత్కరించారు. సిటీ పోలీసు విభాగం సాధించిన పతకాల్లో ఐదు బంగారు, రెండు వెండివి ఉన్నాయి. ఇలాంటి డ్యూటీ మీట్స్‌తో అధికారులు, సిబ్బందిలో ఉన్న ప్రతిభ బయటకు రావడంతో పాటు మరింత మెరుగవుతుందని ఆనంద్ వ్యాఖ్యానించారు. పోలీసు శాఖలో ఇలాంటి టీమ్ వర్క్‌తో కూడిన కార్యక్రమాలతో అధికారులు, సిబ్బంది మధ్య స్నేహభావం పెరుగుతుందని తెలిపారు. ఇప్పుడు పతకాలు పొందిన స్ఫూర్తిని కొనసాగిస్తూ భవిష్యత్తులో జరిగే డ్యూటీ మీట్స్‌లో మరింతగా రాణించాలని కొత్వాల్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీసీపీ శ్వేత, ఏసీపీ జి.గురు రాఘవేంద్ర పాల్గొన్నారు.

రైతుల ఆర్థిక ప్రగతే లక్ష్యం



యాచారంలో నిర్మించిన గోదాంను పరిశీలిస్తున్న డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య

డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య

యాచారం: రైతుల ఆర్థిక ప్రగతే లక్ష్యమని, అర్హులైన వారికి ఎన్ని కోట్ల రుణాలు ఇవ్వడానికైనా సిద్ధమని డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య పేర్కొన్నారు. యాచారం పీఏసీఎస్ కార్యాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీఏసీఎస్ చైర్మన్ తోటిరెడ్డి రాజేందర్‌రెడ్డి, సీఈఓ నాగరాజుతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పీఏసీఎస్‌లో ఎంత మంది రైతులకు రుణమాఫీ అయ్యింది.. దీర్ఘకాలిక రుణాల రికవరీ ఎలా ఉంది.. నిత్యం జరిగే ఆర్థిక లావాదేవీలపై సమీక్ష నిర్వహిస్తున్నారా.. రికార్డులు సక్రమంగా నమోదు చేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. సకాలంలో రుణాలు చెల్లించని రైతులకు నోటీసులు జారీ చేయాలని సూచించారు. కొత్త రైతులకు దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు మంజూరు చేస్తామని, దరఖాస్తులు స్వీకరించాలన్నారు. అనంతరం రూ. 70 లక్షలకుపైగా నిధులతో నిర్మించిన గోదాంను పరిశీలించారు. త్వరలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి ప్రారంభిస్తామని తెలిపారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని 56 పీఏసీఎస్‌ల్లో రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతులకు అనుకూలమైన ధరలకు వ్యవసాయ పనిముట్లు సిద్ధంగా ఉంచనున్నట్లు చెప్పారు. పీఏసీఎస్‌లు, డీసీసీబీ బ్యాంకుల్లో రైతులకు సక్రమంగా సేవలు అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో తుర్కయంజాల్ పీఏసీఎస్ వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

మూడో రోజు ప్రశాంతం

కొనసాగుతున్న గ్రూప్–1 పరీక్షలు

మొయినాబాద్: గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలు బుధవారం మూడో రోజు ప్రశాంతంగా జరిగాయి. 60 శాతం మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. మండల పరిధిలోని కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన 31వ సెంటర్‌లో 600 మంది అభ్యర్థులకుగాను 365 మంది, 32వ సెంటర్‌లో 600 మంది అభ్యర్థులకు 352 మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తహసీల్దార్ గౌతమ్‌కుమార్ పర్యవేక్షించారు.

పటిష్ట బందోబస్తు మధ్య..

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని ఆయా ఇంజనీరింగ్ కళాశాలల్లో గ్రూప్–1 పరీక్షలు సజావుగా కొనసాగుతున్నాయి. బుధవారం మూడోరోజు మండల పరిధిలోని విద్యాజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో 984 అభ్యర్థులకు గాను 590 మంది హాజరు కాగా, అమ్డాపూర్ చౌరస్తాలోని జేబీఆర్‌ఈసీ ఇంజనీరింగ్ కళాశాలలో 816 మందికి గాను 450 మంది అభ్యర్థులు హాజరయ్యారు. పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.



మొయినాబాద్ రూరల్: జేబీఆర్‌ఈసీ ఇంజనీరింగ్ కళాశాల వద్ద పోలీసు బందోబస్తు



మొయినాబాద్: కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

10 ఏళ్ల జైలు.. రూ.23 వేల జరిమానా

- వ్యక్తి మృతికి కారణమైన నిందితుడికి న్యాయస్థానం శిక్ష
- తీర్పు వెల్లడించిన తొమ్మిదో అదనపు జిల్లా జడ్జి హరీష


శ్రీనివాసులు (ఫైల్)

షాద్‌నగర్ రూరల్: మద్యం తాగి, అజాగ్రత్తగా వాహనం నడపడంతో పాటు ఒకరి మృతికి కారణమైన నిందితుడికి పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు జరిమానా విధిస్తూ బుధవారం న్యాయస్థానం తీర్పు వెల్లడించింది. ఇందుకు సంబంధించిన వివరాలను పట్టణ సీఐ విజయకుమార్ వెల్లడించారు. ఫరూఖ్‌నగర్ మండలం నాగులపల్లి గ్రామానికి చెందిన బోడంపాటి గోవర్ధన్‌గౌడ్ 2021 ఏప్రిల్ 21న సొంత పనిపై షాద్‌నగర్‌కు వచ్చాడు. పని ముగించుకుని, సాయంత్రం సమయంలో ప్యాసింజర్ ఆటోలో ఇంటికి బయలుదేరాడు. అప్పటికే మద్యం తాగిఉన్న డ్రైవర్ కావలి శ్రీనివాసులు అతివేగం, అజాగ్రత్తగా వాహనం నడిపాడు. నాగులపల్లి శివారులోని భారతి స్కూల్ సమీపంలోకి రాగానే అదుపు తప్పిన ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గోవర్ధన్‌గౌడ్‌కు తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు మరణించాడు. ఇందుకు కారణమైన డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలంటూ మృతుని సోదరుడు కృష్ణయ్యగౌడ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అన్ని ఆధారాలు సేకరించి, కోర్టులో ప్రవేశపెట్టారు. వీటిని పరిశీలించిన 9వ అదనపు జిల్లా జడ్జి హరీష సాక్ష్యులను విచారించారు. ఆటో డ్రైవర్ మద్యం తాగినట్లు నేరం రుజువు కావడంతో నిందితుడు శ్రీనివాసులకు పదేళ్ల జైలు శిక్ష, రూ.23 వేల జరిమానా విధిస్తూ తీర్పును వెల్లడించారు. ఈ కేసు ఛేదనలో తోడ్పాటును అందించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్, పోసులు సిబ్బందికి సీఐ విజయకుమార్ ప్రత్యేక అభినందనలు తెలియచేశారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి


సమావేశంలో పాల్గొన్న కార్మికులు, నాయకులు

- భవన నిర్మాణ కార్మికులకు థంబ్ విధానాన్ని రద్దు చేయాలి
- ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రామస్వామి

మొయినాబాద్ రూరల్: రాష్ట్రంలో భవన నిర్మాణ రంగ కార్మికులకు థంబ్ విధానాన్ని రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కె.రామస్వామి డిమాండ్‌చేశారు. బుధవారం మండల పరిధిలోని అజీజ్‌నగర్ చౌరస్తాలో లేబర్ అడ్డా వద్ద భవన నిర్మాణరంగ కార్మికుల సమావేశాన్ని ఏఐటీయూసీ మండల నిర్మాణ అధ్యక్షుడు, జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ.. లేబర్ అడ్డాల వద్ద కనీసం వసతులైన తాగునీరు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. అడ్డాలపై నిలుచుంటున్న వారిని కూర్చునేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ రంగ కార్మికుల నూతన కమిటీ నిర్వహించడం అభినందనీయమన్నారు. అధ్యక్షుడిగా కె.దర్శన్, గౌరవ అధ్యక్షుడిగా బి.ప్రభాకర్, ఉపాధ్యక్షుడిగా శ్రీశైలం, కార్యదర్శిగా రాజు, సహాయ కార్యదర్శి కురుమయ్య, కోశాధికారి నాగరాజు, పది మందితో సభ్యులను నియమించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కె.శ్రీనివాస్, ఓబీసీ ఉపాధ్యక్షుడు బి.ప్రభాకర్, నాయకులు వెంకటయ్య, కార్మికులు పాల్గొన్నారు.


నక్కర్తమేడిపల్లిలో ఫార్మాసిటీకి సేకరించిన భూమిలో సాగు చేసిన వరి


అసైన్డ్ భూమిలో సాగవుతున్న పత్తి

ఫార్మా భూముల్లో సిరుల పంట

- టీజీఐఐసీకి సేకరించిన అసైన్డ్, పట్టా భూముల్లో సాగు చేస్తున్న రైతులు
- నాలుగేళ్లుగా ఆర్థిక ప్రగతి

యాచారం: ఫార్మాసిటీ భూముల్లో రైతన్నలు సిరులు పండిస్తున్నారు. అక్కడి నేలలు సాగుకు అనుకూలమైనవి కావడంతో స్థానిక అన్నదాతలు ఆసక్తి చూపుతున్నారు. యాచారం మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో 7,640 ఎకరాల పట్టా, అసైన్డ్ భూమిని ఫార్మాసిటీకి సేకరించారు. అసైన్డ్ రైతులకు ఎకరాకు రూ.ఎనిమిది లక్షలు, ప్రభుత్వ భూముల్లో కబ్జాలో ఉన్న వారికి ఎకరాకు రూ.7.70 లక్షలు, అదే పట్టా భూములకు మొదట్లో రూ.12.50 లక్షలు, ఆ తర్వాత రూ.16 లక్షలకు పెంచారు. 2017లో ఫార్మాసిటీని ఏర్పాటు చేయడానికి అప్పటి సర్కార్ నిర్ణయించింది. అసైన్డ్ భూములను ఫార్మాసిటీకి అత్యధికంగా రైతులు ఇచ్చి పరిహారం సైతం తీసుకున్నారు.

కంచె ఏర్పాటు చేసినా..

ఫార్మాసిటీకి సేకరించిన 7,640 ఎకరాల అసైన్డ్, పట్టా భూమికి టీజీఐఐసీ అధికారులు కంచె, సిబ్బందిని ఏర్పాటు చేశారు. గత సర్కార్ 2017 నుంచి 2023 వరకు భూ సేకరణ చేసి, కంచెలు ఏర్పాటు చేసినప్పటికీ రైతులను మాత్రం ఆ భూముల్లోంచి వెళ్లగొట్టలేదు. భూములిచ్చిన రైతుల మమకారాన్ని కాదనని టీజీఐఐసీ, రెవెన్యూ శాఖల అధికారులు పరిహారం ఇచ్చినా సాగుకు అవకాశం కల్పించారు. మండలంలోని నాలుగు గ్రామాల్లో సేకరించిన 7,640 ఎకరాల్లో దాదాపు 5 వేల ఎకరాలకు పైగానే అసైన్డ్, పట్టా భూములు సాగుకు అనుకూలమైన నేలలు. సేకరించడానికి ముందే రైతులు ఆ భూముల్లో బోరుబావులు తవ్వించి పంటలు పండించుకునే వారు. అప్పటి సర్కార్ ఫార్మాసిటీకి సేకరించిన భూముల్లో ఏదైనా స్థాపించే వరకు రైతులు ఆ భూముల్లో పంటలు పండించుకునేందుకు అవకాశం కల్పించింది.

రూ.లక్షల్లో ఆదాయం

ఫార్మాసిటీ భూముల్లో రైతులు పంటలు పండిస్తూ మంచి లాభాలు పొందుతున్నారు. బోరు బావులున్నవారు వరి, కూరగాయల పంటలను పండిస్తుండగా, మిగతా రైతులు ఆరుతడి కింద పత్తి, జొన్న, మొక్కజొన్న తదితర పంటలను సాగు చేస్తున్నారు. ఎకరా పొలంలో ఏటా రూ.రెండు నుంచి రూ.మూడు లక్షలకు పైగానే ఆదాయం పొందుతున్నారు. రెండేళ్లుగా పత్తి క్వింటాల్‌కు రూ.7 వేలకు పైగానే డిమాండ్ ఉండడంతో లాభాలు వచ్చాయి. ఒక్క నక్కర్తమేడిపల్లిలోని రెండు వేల ఎకరాల్లో వరి, పత్తి పంటలను పండిస్తూ ఏటా రూ.10 నుంచి రూ.20 కోట్లకు పైగానే ఆదాయం పొందుతున్నట్లు గ్రామ రైతులు పేర్కొంటున్నారు. నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో కూరగాయల పంటలను పండిస్తున్నారు.

టీజీఐఐసీకి అప్పగించాం



ఫార్మాసిటీకి సేకరించిన భూములను మూడేళ్ల కిందనే టీజీఐఐసీకి అప్పగించాం. వృథాగా ఉన్న భూముల్లో రైతులు పంటలు పండిస్తే తప్పేమి కాదు. రైతుల ఆర్థిక ప్రగతే లక్ష్యంగా సర్కార్ కృషి చేస్తుంది. ఫార్మాకు భూములిచ్చిన రైతుల కుటుంబాల్లోని యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం.

– అనంత్‌రెడ్డి, ఆర్డీఓ, ఇబ్రహీంపట్నం

‘మా ప్లాట్లలో అక్రమ నిర్మాణాలు ఆపండి’

శంకర్‌పల్లి: తాము కొన్న ప్లాట్లలో కొందరూ అక్రమంగా ప్రహరీ నిర్మిస్తున్నారని ఆరోపిస్తూ బుధవారం శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్‌కు యజమానులు ఫిర్యాదు చేశారు. బాధితుల వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని బుల్కాపూర్ గతంలో పంచాయతీ ఉండేది. 1990లో సర్వే నం.80, 81, 85లో జీపీ అనుమతితో లే అవుట్ చేశారు. దీంట్లో శ్రీకాంత్‌రెడ్డి, ప్రవీణ్, వీరేందర్, రంగస్వామి, సత్యనారాయణ, నాగభూషణచారీ, నర్సయ్య, వెంకటేషం తదితరులు ప్లాట్లు కొనుగోలు చేశారు. లే అవుట్ చేసిన వారు రెవెన్యూ రికార్డుల్లో వ్యవసాయ భూమిని ప్లాట్లుగా మార్చకుండానే వదిలేశారు. ప్లాట్లు కొన్న యాజమానులు వ్యాపార రీత్యా దూర ప్రాంతాలకు వెళ్లిపోయారు. రాష్ట్రంలో రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన తర్వాత గతంలో భూమి ఉన్న వారి పేరు మీదనే రికార్డు వచ్చింది. దీంతో పాత వారు మళ్లీ విక్రయాలు జరపగా.. కొన్న వారు ఆ భూమిలో ప్రహరీ గోడను నిర్మించుకున్నారు. విషయం తెలుసుకున్న ప్లాట్ల బాధిత యాజమానులు అడ్డుకొన్నప్పటికీ వారు పట్టించుకోవడం లేదు. దీంతో తమకి న్యాయం చేయాలంటూ బాధిత ప్లాట్ల యాజమానులు మున్సిపల్‌లో ఇప్పటికే మూడు సార్లు ఫిర్యాదు చేశారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌ని వివరణ కోరగా.. మున్సిపాలిటీ ఏర్పడే సమయంలో బుల్కాపూర్‌లో ఎటువంటి లే అవుట్లుగా లేవని.. భూములకు సంబంధించిన విషయాలను రెవెన్యూ శాఖను సంప్రదించాలన్నారు.

అనుమానాస్పద స్థితిలో యూపీ కార్మికుడి మృతి

ఇబ్రహీంపట్నం: అనుమానాస్పద స్థితిలో ఓ కార్మికుడు మృతిచెందిన సంఘటన ఇబ్రహీంపట్నం పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అనిల్‌సింగ్(46) ఐదు నెలల క్రితం వినోభానగర్ సమీపంలోని వైట్ గోల్డ్ కంపెనీలో పనికి కుదిరాడు. ఇదిలా ఉండగా బుధవారం ఉదయం 8 గంటలవుతున్నా నిద్ర లేవకపోవడంతో తోటి కార్మికులు వెళ్లి లేపేందుకు ప్రయత్నించారు. ఉలుకుపలుకు లేకపోవడంతో వెంటనే అతన్ని ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ విషయాన్ని యూపీలోని అనిల్ కుటుంబ సభ్యులకు తెలియజేయగా.. మృతుడి బంధువులు విమానంలో ఇక్కడకు చేరుకున్నారు. తన తండ్రి మృతిపై అనుమానం ఉందని అనిల్‌సింగ్ కూతురు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఊరెళ్దామని.. వేరే బస్సెక్కి

పాఠశాలలో అదృశ్యమైన విద్యార్థి ఉప్పల్‌లో ప్రత్యక్షం


నితిన్

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల నుంచి అదృశ్యమైన విద్యార్థి ఉప్పల్‌లో ఆచూకీ లభ్యమైనట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. యాచారం మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన గడ్డం నితిన్(14) స్థానిక గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం ఉదయం నుంచి పాఠశాలలో కనిపించకుండా పోయాడు. వెంటనే ప్రిన్సిపాల్ వరూధిని తల్లిదండ్రులకు, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పలుచోట్ల గాలించారు. అదృశ్యమైన విద్యార్థి ఉప్పల్‌లో ఉన్నట్లు అదేరోజు రాత్రి పోలీసులకు సమాచారం వచ్చింది. కాగా స్వగ్రామానికి వేళ్లేందుకు స్థానిక బస్టాండ్‌కు వచ్చి యాచారం వెళ్లే బస్సుకు బదులుగా ఉప్పల్ బస్సు ఎక్కినట్లు నితిన్ పోలీసులకు తెలిపారు. బాలుడికి కౌన్సెలింగ్ నిర్వహించి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వరూధిని సమక్షంలో తల్లిదండ్రులకు పోలీసులు అప్పగించారు.

అంబేడ్కర్ భవన స్థలాన్ని కాపాడండి


మహేశ్వరం ఏసీపీకి ఫిర్యాదు చేస్తున్న అంబేడ్కర్ యువజన సంఘం ప్రతినిధులు

కందుకూరు: తమ సంఘానికి కేటాయించిన స్థలాన్ని ఇతరులు కబ్జా చేసి, ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారని, వీరిపై చర్యలు తీసుకోవాలని మండల పరిధిలోని బాచుపల్లికి చెందిన అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు బుధవారం మహేశ్వరం ఏసీపీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. 2007లో స్థానిక ఇందిరమ్మ కాలనీలో అంబేడ్కర్ భవనం కోసం 800 గజాల స్థలాన్ని కేటాయించారన్నారు. అందులో 460 గజాల్లో భవన నిర్మాణానికి 2011లో రూ.4 లక్షలు, 2021లో రూ.10 లక్షలు అప్పటి ప్రభుత్వాలు మంజూరు చేశాయి. దీంతో పనులకు శంకుస్థాపన చేసినా, నిర్మాణాన్ని ప్రారంభించలేదన్నారు. ఈ స్థలంలో ప్రస్తుతం కొంతమంది ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారని స్పష్టంచేశారు. ఇదేమని ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారు. స్థలాన్ని కాపాడాలని కోరారు.

మూడు నెలలకు ఇంటికి చేరిన యువతి


సీఐ ఆదిరెడ్డి సమక్షంలో హైమావతిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఆశ్రమ నిర్వాహకులు

మతిస్థిమితం లేకపోవడంతో చేరదీసిన ఆశ్రమ నిర్వాహకులు

షాద్‌నగర్‌రూరల్: మతిస్థిమితం లేని యువతి ఇంటి నుంచి బయటకు వెళ్లి మూడు నెలల తరువాత కుటుంబ సభ్యులను చేరింది. ఓ ఆశ్రమ నిర్వాహకులు బుధవారం యువతిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి.. పట్టణానికి చెందిన హైమావతికి మతిస్థిమితం సరిగా లేకపోవడంతో మూడు నెలల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయింది. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండల కేంద్రంలో దయనీయమైన స్థితిలో రోడ్డుపై తిరుగుతుంది. గమనించిన జడ్చర్లలోని శ్రీ సత్యేశ్వర సేవా మానసిక, దివ్యాంగుల ఆశ్రమ నిర్వాహకులు హైమావతిని చేరదీశారు. అక్కడ ఆమెకు సపర్యలు చేయడంతో పాటుగా వైద్య సేవలను అందించారు. మానసిక పరిస్థితి కోలుకున్న తరువాత ఆశ్రమ నిర్వాహకులు ఆమె చిరునామాను తెలుసుకొని సమాచారాన్ని అందించారు. దీంతో కుటుంబ సభ్యులు జడ్చర్లకు చేరుకొని యువతిని గుర్తించారు. ఆశ్రమ నిర్వాహకులు చిత్తనూరి ఈశ్వర్, చిత్తనూరి రామకృష్ణ, జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి సమక్షంలో హైమావతిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. హైమావతిని చేరదీసి చికిత్స అందించి, సపర్యలు చేసిన ఆశ్రమ నిర్వాహకులు, సిబ్బందికి యువతి కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

భార్యతో గొడవపడి వ్యక్తి అదృశ్యం


షేక్ ఎజాజ్ (ఫైల్)

పహాడీషరీఫ్: భార్యతో గొడవపడిన వ్యక్తి ఇంటి నుంచి వెళ్లిపోయిన సంఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై షేక్ యూసుఫ్ జానీ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. షాహీన్‌నగర్ తయ్యబా కాలనీకి చెందిన షేక్ ఎజాజ్(45)కు నజ్మాబేగంతో 14 ఏళ్ల క్రితం వివాహం జరగగా ఆరుగురు పిల్లలు సంతానం. కాగా ఇటీవల ఎజాజ్ మరో మహిళతో వివాహేతర సంబంధాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న భార్య అతన్ని ఈ నెల 21న ప్రశ్నించింది. దీంతో తన సెల్‌ఫోన్‌ను ఇంట్లోనే వదిలేసిన ఎజాజ్ ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లిపోయాడు. ఎంతకి తిరిగి రాకపోవడంతో అతని ఆచూకీ కోసం సాధ్యమైన అన్ని ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

7.058 కేజీల గంజాయి పట్టివేత

నాలుగు కేసుల్లో ఆరుగురి అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: నాలుగు కేసుల్లో 7.058 కేజీల గంజాయిని, మరో కేసులో తొమ్మిది గ్రాముల ఎండీఎంఎను బుధవారం ఆబ్కారీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. వీరిలో ఇద్దరు కీలక వ్యక్తులు ఉన్నారని పోలీసు అధికారులు చెబుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నగరంలోని కేకేనగర్, బండ్లగూడ ప్రాంతంలో 1.500 కిలోలు, గుడిమల్కాపూర్ నల్లపోచమ్మగుడి ప్రాంతంలో 1.308, ధూల్‌పేట్‌లో 1.4, చందానగర్‌లో 2.850 కిలోల గంజాయిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు బుధవారం స్వాధీనం చేసుకున్నాయి. ఈ కేసుల్లో నాలుగు సెల్ ఫోన్లు , మూడు బైక్లులను స్వాధీనం చేసుకున్నారు. మరో కేసులో బెంగళూరు నుంచి హైదరాబాద్ బస్సులో డ్రగ్స్ తెచ్చి బుక్ చేసుకున్న వారికి అందించి తిరిగి వెళుతున్న అజయ్ కుమార్‌ను ఎస్టీఎఫ్ సీఐ శిరీష బృందం లక్డీకాపూల్‌లో పట్టుకున్నారు. వృత్తి రీత్యా వెల్డింగ్ పని చేస్తున్న అజయ్ కుమార్ బెంగళూరులో డ్రగ్స్ సప్లయర్ మారాడు. డ్రగ్స్‌ను బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు తెచ్చి ఇస్తుంటాడు. ఇలా చేసినందుకు కొంత సొమ్ము తీసుకుంటాడు. పట్టుబడిన గంజాయి, డ్రగ్స్ విలువ సుమారు రూ. 3.83 లక్షలు ఉంటుందని అంచనా వేస్తున్నారు. సిబ్బందిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి, రంగారెడ్డి, హైదరాబాద్ అసిస్టెంట్ కమిషనర్లు ఆర్. కిషన్, అనిల్‌కుమార్‌రెడ్డి, ఎస్టీఎఫ్ టీమ్ లీడర్ ఆపరేషన్ ధూల్‌పేట్ ఇన్‌చార్జి నంద్యాల అంజిరెడ్డి అభినందించారు.

గ్యాంగ్‌స్టర్ అయూబ్ ఖాన్ చిక్కాడు

కోర్టు విచారణకు కొన్నాళ్లుగా డుమ్మా

- ఎన్‌బీడబ్ల్యూ జారీ చేసిన న్యాయస్థానం
- గాలించి పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ టీమ్
- పట్టుబడ్డ మరో నిందితుడు అఫ్జల్


అయూబ్ ఖాన్, అఫ్జల్

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన కరడుగట్టిన రౌడీషీటర్, గ్యాంగ్‌స్టర్ అయూబ్ ఖాన్ దక్షిణ మండల టాస్క్‌ఫోర్స్‌కు చిక్కాడు. తనపై నమోదైన కేసుల్లో బెయిల్ పొందిన ఇతను కొన్నాళ్లుగా కోర్టు విచారణకు గైర్హాజరవుతున్నాడు. ఈ నేపథ్యంలో న్యాయస్థానం జారీ చేసిన నాన్–బెయిలబుల్ వారెంట్ (ఎన్బీడబ్ల్యూ) ఆధారంగా పట్టుకున్నట్లు బుధవారం టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాస రావు తెలిపారు. మరో రౌడీషీటర్ అఫ్జల్‌ను సైతం కటకటాల్లోకి పంపినట్లు పేర్కొన్నారు.

మూడు కమిషనరేట్లలో 72 క్రిమినల్ కేసులు..

కుమ్మరివాడీ ప్రాంతానికి చెందిన అయూబ్ ఖాన్‌పై శాలిబండ ఠాణాలో రౌడీషీట్ ఉంది. ఇతనిపై మూడు కమిషనరేట్లలోని వివిధ పోలీసుస్టేషన్లలో 72 క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. వీటిలో 14 హత్య, మరో 14 హత్యాయత్నానికి సంబంధించినవి. మిగిలినవి దోపిడీ, బెదిరింపులు, ఆయుధ చట్టం కింద రిజిస్టర్ అయ్యాయి. కామాటిపురా ఠాణాలో నమోదైన ఓ కేసులో బెయిల్ పొందిన అయూబ్ ఖాన్ కొన్నాళ్లుగా నాంపల్లి కోర్టులో జరుగుతున్న విచారణకు హాజరుకావట్లేదు. దీంతో న్యాయస్థానం ఇతడిపై నాన్–బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. దీని ఆధారంగా రంగంలోకి దిగిన దక్షిణ మండల టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాఘవేంద్ర నేతృత్వంలో ఎస్సైలు కె.నర్సింహులు, జి.ఆంజనేయులు, ఎన్.నవీన్‌లతో కూడిన బృందం ముమ్మరంగా గాలించింది. ఎట్టకేలకు అయూబ్‌ను పట్టుకుని కామాటిపురా పోలీసులకు అప్పగించింది.

అఫ్జల్‌పై 44 క్రిమినల్ కేసులు..

కాలాపత్తర్ ఠాణాలో రౌడీషీటర్‌గా ఉన్న మహ్మద్ అఫ్జల్‌పై మూడు కమిషనరేట్లలోని వివిధ పోలీసుస్టేషన్లలో 44 క్రిమినల్ కేసులు ఉన్నాయి. 2000 నుంచి నేరాలు చేయడం ప్రారంభించిన ఇతడిపై రెండు హత్య, ఆరు హత్యాయత్నం కేసులూ ఉన్నాయి. కాలాపత్తర్ ఠాణాలో నమోదైన ఓ హత్యాయత్నం కేసుల్లో వాంటెడ్‌గా ఉన్నాడు. అక్రమ ఆయుధంతో సంచరిస్తున్న ఇతని కదలికలపై దక్షిణ మండల టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందింది. రంగంలోకి దిగిన అధికారులు పట్టుకుని అక్రమాయుధాన్ని స్వాధీనం చేసుకున్నారు. విచారణ నేపథ్యంలో కాలాపత్తర్ కేసులో వాంటెడ్ అనే విషయం తెలియడంతో అక్కడి అధికారులకు అప్పగించారు.